వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ గోపాల్‌నగర్ రోడ్డులో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, అధికారులు

అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

డ్రైనేజీ పనుల్లో జాప్యం ఎందుకు..?

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 4: డ్రైనేజీ పనులు చేయడానికి జాప్యం ఎందుకు చేస్తున్నారని, డ్రైనేజీ సమస్యలతో రోడ్లపై వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని గోపాల్‌నగర్, బాలాజీనగర్ డివిజన్‌లోని కైత్లాపూర్‌ల వద్ద డ్రైనేజీ సమస్యలను జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించే దిశగా.. డ్రైనేజీ పనులను శంకుస్థాపన చేయడం జరిగిందని, నేటికి ఆ పనులను పూర్తిచేయకుండా పెండింగ్‌లో పెట్టారన్నారు. డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికారులు స్పందించరా అని ప్రశ్నించారు. పెండింగ్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, రాజేశ్‌రాయ్, తదితరులు ఉన్నారు.

మహిళలు స్వయం కృషితో ఎదగాలి

మహిళలు స్వయం కృషితో ఎదగాలని, పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో మహిళలే అగ్రగామిగా నిలుస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా సెల్‌వెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్(టైలరింగ్) శిక్షణ తరగతులను ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, ఫౌండేషన్ సీఎండీ సుబ్బారావు, ఆలయ కమిటీ చైర్మన్ కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా వృద్ధిని సాధించాలన్నారు. ఈ కేంద్రంలో శిక్షణ పూర్తిచేసుకున్న 150 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, రాజేశ్‌రాయ్, ఉప్పల చంద్రశేఖర్ గుప్తా, పుల్లయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

అల్లాపూర్, డిసెంబర్ 4: అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ మైసమ్మ చెరువు పరీవాహక ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ సబీహా బేగం, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. డ్రైనేజీ పైపులైన్ నుంచి వచ్చే మురుగు మైసమ్మ చెరువులో కలువకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. చెరువులోకి మురుగునీరు వచ్చి చేరడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు, గుర్రపు డెక్క మొలిచి దోమలు, ఈగలకు ఆవాస కేంద్రంగా మారిపోయిందన్నారు. పైపులైన్ పనులు పూర్తయితే మైసమ్మ చెరువు పూర్తిస్థాయిలో ప్రక్షాళణ జరగడంతో పాటు చెరువులోని నీరు కలుషితం కాకుండా ఉంటుందన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, నాగుల సత్యం, సయ్యద్‌రియాజ్, అస్లం, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన కంప్యూటరీకరణ పరిశీలన

నిజాంపేట్ కార్పొరేషన్‌లో పర్యటించిన జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

డబుల్‌బెడ్ రూం ఇండ్లల్లోని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, తదితరులు

దుండిగల్, డిసెంబర్ 4: మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) రాధికా గుప్తా బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బీవీఆర్ఐటీ, వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలల్లో జరుగుతున్న కులగణన కంప్యూటరీకరణను పరిశీలించారు. అనంతరం బాచుపల్లి, నిజాంపేట్‌లోని డబుల్‌బెడ్ రూం ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వీధి లైట్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా వంటి సమస్యలు ఉన్నాయని స్థానికులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే సమయంలో డబుల్‌ఇండ్ల లబ్ధిదారులు సైతం పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఇండ్ల మధ్యన ఉన్న ఖాళీ ప్రదేశాలను పార్కులుగా, చిన్నారుల క్రీడమైదానాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు వెంటనే వాటిల్లో చేరాలని సూచించారు. ఖాళీగా ఉండే ఇండ్లను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో బాచుపల్లి తాసీల్దార్ పూల్‌సింగ్, డిప్యూటీ తాసీల్దార్ ప్రభుదాస్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ ఆలీ, శానిటేషన్ ఇన్‌చార్జి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సుకృతరెడ్డితో పాటు హౌసింగ్ బోర్డ్ అధికారులు పాల్గొన్నారు.

ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ కార్యదర్శి కే.లక్ష్మణ్, తదితరులు

దుండిగల్, డిసెంబర్ 4: రాష్ట్రంలో ఆటో, టాక్సీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ 'బ్యాక్‌వ్యాన్' పేరుతో డిసెంబర్ 7న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండలం కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరంలోని ఈఎస్ఐ చౌరస్తాలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుకై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒకరోజు చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్‌లు చలో హైదరాబాద్‌కు వేలాదిగా తరలిరావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అధికారంలోకి రాగానే సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 12 నెలలు గడుస్తున్న డ్రైవర్లను ఆదుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. నష్టపోయిన డ్రైవర్లను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆటో యూనియన్ కుత్బుల్లాపూర్ మండల నాయకులు ఎస్‌కే.ఖలీల్, వినయ్, సద్దాం, శ్రీనివాస్, యూనస్, సయ్యద్, మహారాజ్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

బల్దియా కౌన్సిల్ సభ్యులు శ్రీకాంత్

మియాపూర్ డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గుడిసెలు కాలిన బాధితులను బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ బుధవారం పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంలో గుడిసె సహా సామగ్రి నష్టపోయిన బాధితులకు అండగా నిలుస్తామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ఆర్థిక సాయం సహా ఇతర వెసులుబాట్లను కల్పించేందుకు ఎమ్మెల్యే గాంధీతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్, కొండల్, లక్ష్మయ్య, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 4

కూకట్‌పల్లి టూ బాలానగర్ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

బాలానగర్‌ను వదలని ట్రాఫిక్ బూతం

- ఇబ్బందుల్లో వాహనదారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

బాలానగర్, డిసెంబర్ 4: రామేశ్వరం పోయినా శనీశ్వరుడు వదల్లేదు అన్న పురాతన సామెత చందంగా బాలానగర్‌లో ట్రాఫిక్ కష్టాలు దూరం చేయాలని ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టినా మూసాపేట వై జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ కారణంగా బాలానగర్‌కు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం మూసాపేట వై జంక్షన్ నుంచి మొదలు కొని బాలానగర్ ఫ్లై ఓవర్‌పై వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు గంట సమయం పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకొన్న వాహనదారుల వెతలు వర్ణణాతీతం. ఈ ట్రాఫిక్ ఇబ్బందులు ఒక్క రోజుతో సరి పెట్టుకుంటాయా అంటే అవునూ.. అని కాదని చెప్పలేని నిజం దాగిఉంది. బాలానగర్ పారిశ్రామిక వాడలో ఇలాంటి ట్రాఫిక్ చిత్రాలు కనపడక చాలా రోజులైంది, మళ్లీ ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయని వాహనదారులు చర్చించుకోవడం గమనార్హం. మూసాపేట వై జంక్షన్‌లో ప్రతి రోజు నెలకొంటున్న ఈ ట్రాఫిక్ సమస్యపై ఇటు కూకట్‌పల్లి, అటు బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి తగిన నిర్ణయం తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా కూకట్‌పల్లి, బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పరిశీలన చేసి వాహనదారుల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష.. సన్మానం

ఆల్విన్ కాలనీ డివిజన్ సాయినగర్ వెస్ట్ కాలనీకి చెందిన లక్ష్మణ్ గౌడ్ నివాసంలో అయ్యప్ప స్వాములకు బుధవారం భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామికి అన్న ప్రసాదాన్ని సమర్పించి వితరణ చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సింహ గౌడ్, శివరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. – మియాపూర్, డిసెంబర్ 4

రహదారి పనులు పరిశీలన

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మచెరువు వద్ద కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత కీలకమైన ఈ దారిలో మరింత సౌకర్యవంతమైన ప్రయాణం కోసం పక్కా రహదారిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని వెంకటేశ్ గౌడ్ సూచించారు. రామకృష్ణ, సమ్మారెడ్డి, పోశెట్టి పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 4

జగద్గిరిగుట్ట నుంచి శ్రీశైలానికి పాదయాత్ర

జగద్గిరిగుట్ట, డిసెంబర్ 4: జగద్గిరిగుట్ట నుంచి బుధవారం కార్పొటేటర్ జగన్ నేతృత్వంలో 70 మంది శివమాలధారులు శ్రీశైలం పాదయాత్ర చేపట్టారు. మఖ్దూంనగర్ శివసీతారామాంజనేయ ఆలయంలో ప్రత్యేకపూజలు జరిపారు. దశాబ్ద కాలంగా నడకగా యాత్ర చేయడం ఆనవాయితీ అని భక్తులు తెలిపారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి నైట్ బజార్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

శిల్పారామంలో మహిళా శక్తి బజార్

- నేడు ప్రారంభించనున్న గవర్నర్, సీఎం
- ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్ శాంతి కుమారి

మాదాపూర్, డిసెంబర్ 4: ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 5న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శిల్పారామంలో దాదాపు 106 షాపులతో ఇందిరా మహిళా శక్తి నైట్ బజార్‌ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో శిల్పారామంలో ఏర్పాటు చేయనున్న ఇందిరా మహిళా శక్తి నైట్ బజార్‌ను బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సందర్శించి ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికై శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి నైట్ బజార్‌ను ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పంతో నైట్ బజార్‌లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే స్టాల్ ఏర్పాట్ల ప్రక్రియ పూర్తయ్యాయి. ఇందులో స్వయం శక్తి మహిళా సంఘాలు, పిండి వంటకాల స్టాల్స్, హస్తకళలకు చెందిన స్టాల్స్, మహిళలు స్వయంగా తయారు చేసిన పలు ఉత్పత్తులకు చెందిన స్టాల్స్‌లను ఏర్పాటు చేశారు. శిల్పారామంలో నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు నగర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు విచ్చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కన్నేశారా.. కొట్టేశారే..!

- సర్కార్ స్థలం కనిపిస్తే నిర్మాణాలు
- ధోభీఘాట్ స్థలాన్ని ఫలహారంలా పంచుకుంటున్నారు
- చింతల్ డివిజన్, భగత్‌సింగ్‌నగర్‌లోని ధోభీఘాట్‌పై అక్రమార్కుల కన్ను
- భూ కబ్జాల వెనుక స్థానిక నేతలదే కీలక పాత్ర

ధోభీఘాట్ స్థలాన్ని చదును చేసి, నిర్మాణానికి రాళ్లు, డస్ట్ కుప్పలు ఏర్పాటు చేసిన దృశ్యం

దుండిగల్, డిసెంబర్ 4: ప్రభుత్వం రజకులకు కేటాయించిన స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. అయితే ప్రభుత్వం కేటాయించిన భూములకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో ధోభీఘాట్‌ల స్థానంలో సొసైటీ సభ్యులు ఇండ్లు నిర్మించుకున్నారు. ఈ క్రమంలో మిగిలిన కొద్దిపాటి స్థలంపై పెద్దల కన్ను పడింది. ఇంకేముంది ఎవరికి తోచినంత వారు పంచుకుని ఆక్రమిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కుత్బుల్లాపూర్ మండలం సర్వేనంబర్ 155, మొగుళ్లచెరువులో 29ఎకరాల 10గుంటల శిఖంభూమి ఉంది. ఇందులో 24ఎకరాల10గుంటల స్థలంలో భగత్‌సింగ్ నగర్ ఏర్పాటైంది. మిగిలిన 1994లో 2ఎకరాల39 గుంటలను స్థానిక రజకులు గాంధీ వాషర్స్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో 72 మంది ఒక అసోసియేషన్‌గా ఏర్పడటంతో ధోభీఘాట్‌కు కేటాయించారు. దీని చుట్టూ ప్రహరీని నిర్మించారు. అయితే కొన్ని రోజుల తర్వాత మరో 12మంది సభ్యులు జత కలిశారు. దీంతో మొత్తం 84మంది ధోభీఘాట్‌కు కేటాయించిన స్థలంలో ఇండ్లను నిర్మించుకున్నారు. మిగిలిన 29గుంటల స్థలంపై స్థానిక పెద్దల కన్ను పడింది. ఇంకేముంది ఎవరికి వారుగా అందినకాడికి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో అధికారపార్టీ నేతలతో పాటు బస్తీ నాయకులు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గత పక్షం రోజులుగా సదరు మిగులు భూమిని చదునూచేస్తూ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారని, అక్రమార్కుల నుంచి ఈ భూమిని ఎలాగైనా రక్షించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇప్పటివరకు తనకు ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదు అందలేదు. భగత్‌సింగ్‌నగర్‌లోని ధోభీఘాట్ స్థలాలను పరిశీలిస్తాం. ఎవరైనా వాటిని కబ్జా చేసేందుకు యత్నిస్తే వాటిని రక్షించి.. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– కుత్బుల్లాపూర్ తానీల్దార్ రెహమాన్

ఎంఈడీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఓయూ పరిధిలోని ఎంఈడీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

పూల్‌బాగ్‌కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, డిసెంబర్ 4: పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఫిరోజ్‌గూడ పూల్‌బాగ్‌కాలనీలో డ్రైనేజీ పనులను జలమండలి డీజీఎం శంషీర్, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యను నాణ్యతతో పాటు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు పి.సభాపతిరెడ్డి, త్రికోటేశ్వర్ రావు, బీఆర్ఎస్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, గౌతమ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..!

- అనేక ఫిర్యాదులతో స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- బహుళ అంతస్తుల నిర్మాణం సీజ్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 4: వడ్డించేటోడు మనోడైతే.. ఏ మూలకు కూసుంటే ఏముందన్న చందంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణదారులకు పాటగా మారింది. గతంలో అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం అప్పటి అధికారులు ఇక్కడి నుంచి మరో చోటకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో కొత్త అధికారులు వచ్చారు. ఇంకేముంది అక్రమ నిర్మాణాలపై ఒక్కొక్కటిగా లెక్కలేసుకుంటూ ముందుకెళ్తున్నారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇక కొత్త అధికారులకు తలనొప్పులుగా మారడంతో దూకుడు పెంచారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. దీనిలో భాగంగా సుచిత్ర చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ వైపునకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా హనుమాన్ దేవాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. నిబంధనలు ఒకట్టైతే.. నిర్మాణం మరొలా చేపట్టడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు అధికారులకు స్పందించి అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు.



కుత్బుల్లాపూర్ విలేజ్ హనుమాన్ దేవాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాన్ని సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఎండీహెచ్ఎం పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4 : ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షా ఫీజును ఈ నెల 9 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను నెలలోనే నిర్వహించనున్నటు, పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.